

-శారదా అశోకవర్ధన్

# చంద్రముఖితేష్


నా స్నేహితురాలు చంద్రావతికి ఆ సాయంత్రం రవీంద్రభారతిలో సన్మానం. సాధారణంగా సన్మానాలకి ఒప్పుకోదు చంద్రావతి, ఆ సన్మానం చేస్తానన్న వాళ్లు తనను నిజంగా అభిమానించి గౌరవించేవాళ్లు అన్న నమ్మకం కుదిరితే తప్ప! 'చంద్రావతి పాటంటే చెవి కోసుకోని వాళ్లుండరు' అంటే అతిశయోక్తి కాదేమో! ఆమె కంఠం అటువంటిది! కంచులా మోగుతుంది. ఆ కంఠంలో రాగాలు మెలికలు తిరిగిపోతాయి. ఎందరికో నటీమణులకు ప్లేబ్యాక్ పాడింది. ఇంకెందరో నర్తకీమణుల నృత్యానికి గాత్ర సహకారాన్నందించింది. చంద్రావతి గానాన్ని అభిమానించే వారందరూ ఆమె సన్మానాన్ని కళ్ళారా చూడాలని వయోవృద్ధులు సయితం వచ్చారు. ఆమెతో నా స్నేహం మా చిన్ననాటిది. వాళ్లిల్లూ, మా ఇల్లూ పక్కపక్కనే వుండేది విశాఖపట్నం దాండపర్తిలో. ఇద్దరం ఒకే స్కూలు. నాకంటే చంద్రావతి ఒక సంవత్సరం పెద్ద. ఒక తరగతి పై క్లాసులో వుండేది. స్కూల్లో వున్నప్పటి నుంచీ కూడా, పాటలంటే తన పేరూ నాటకాలంటే నా పేరూ అందరికీ అలవాటయిపోయింది స్కూల్లో జరిగే ప్రతీ కార్యక్రమంలోనూ. స్కూల్ ఫైనల్ తరవాత మా దారులు వేరయ్యాయి. నేను ఎంబిఏ చేసి పెళ్లయ్యాక మా ఆయనతోపాటు హైదరాబాదొచ్చేశాను. చంద్రావతి మ్యూజిక్ ఎం.ఏ. చేసి మద్రాసులో సెటిలయిపోయింది. వాళ్లాయన ఒక ప్రఖ్యాత రికార్డింగ్ కంపెనీలో సౌండ్ ఇంజనీర్. మేము వేరయినా మా దారులు వేరయినా, మా స్నేహం మాత్రం ఒకటిగా వుండేది అప్పుడూ ఇప్పుడూ కూడా. ఆమెకి చాలా గర్వం అనేవారందరూ! కాదు. అది ఆమె ఆత్మవిశ్వాసం అనేదాన్ని నేను. అయినా ఆమె ముద్ర ఆమెదే నా మాట నాదే!

హాలంతా ఎంతో చక్కగా అలంకరించారు. జంటనగరాలలోని ప్రముఖులతో, ఇతర అభిమానులతో రవీంద్రభారతి క్రిక్కిరిసిపోయింది. కారు దిగుతూన్న మాకు అల్లంత దూరానికే వినబడుతున్నాయి. హాల్లో ఆర్గనైజర్లు పెట్టిన ఆమె కేసెట్. ప్రక్కన ఆమెతో మాట్లాడుతూ, ఆ పాటలు దూరం నించి వింటూ నడుస్తూన్న నాలో ఏదో థ్రిల్! చల్లని సాయంకాలం. చక్కని పాటలు. అందమైన చంద్రావతి ఆనందంగా, వయ్యారంగా అడుగులేస్తూ హాల్లో కొస్తూ ఉంటే, అచ్చంగా సంగీత సరస్వతి, స్వయంగా సభ నిర్వహించడానికి హాల్లోకొస్తూ వున్నంత గొప్ప అనుభూతి, బహుశః నాకే కాదు. అందరిలోనూ కలిగుంటుంది. అందుకే అందరూ వారి మనోభావాలని హర్షధ్వానాల ద్వారా తెలిపారు. ఆ కరతాళ ధ్వనుల మధ్య ఆమె పక్కనే కూర్చున్నాను నేను. సన్మానానికి ముందు కొందరు యువ గాయనీ గాయకులు, ఆమె పాటలు పాడతారు అని అనౌన్స్‌మెంటు చేశారు. వరసగా కొందరు అబ్బాయిలూ, అమ్మాయిలూ వారెంచుకున్న పాటలు పాడి వినిపించారు. చంద్రావతి ముందు పాడడానికి కొంచెం భయం. కొంచెం పిరికితనం. అయితే, చిత్రంగా ఒకమ్మాయిని వీల్‌ఛెయిర్‌లో తీసుకొచ్చారు స్టేజీ మీదికి. 'ఈ అమ్మాయి పేరు వెన్నెల. రెండు కాళ్లూ పోలియో వ్యాధితో పోయాయి. అయినా ఆమె ఉత్సాహం పోలేదు. పట్టుదల పారిపోలేదు. కష్టపడి మెట్రిక్ వరకూ చదివింది. ఫస్ట్ క్లాసులో పాసయింది ప్రయివేటుగా రాసి. ఈ అమ్మాయికి భగవంతుడిచ్చిన వరం, చక్కని కంఠం, సంగీతం మీద అభిమానం. అందుకే మ్యూజిక్‌లో బి.ఏ. చేసింది. కాళ్లు లేవనే కలవరం ఎన్నడూ లేదు. హాయిగా పాడుకుంటుంది. ఆనందంగా ఉంటుంది. ఆమె తండ్రి అదిగో అతడే. ఆమెని వీల్‌చెయిర్‌లో స్వయంగా తీసుకొచ్చిన అతడే! పొత్తిళ్లలో పాపలా, కంటికిరెప్పలా కాపాడే తండ్రి వీరరాఘవరావు. వంటా వార్పూ చేసుకుంటూ, వెన్నెలకి స్నానపానాదుల దగ్గరి నుంచి, బట్టలు కట్టి మనసులో మనసుగా కనిపెట్టుకు చూసే తల్లి లక్ష్మీకాంతమ్మ గారయితే, ఇలా సభలకూ, సమావేశాలకూ, పరీక్షలకూ, కోరుకున్న ప్రతి చోటికీ తీసుకువెళ్ళే బాధ్యత తండ్రిది. ఆమె తన పాటను, చంద్రావతి గారు పాడిన 'మాయలు చాలించు మధుసూదనా' జావళిని ఆమె ముందు పాడి వినిపించాలని, ఈ కార్యక్రమానికి వచ్చారు. ముఖ్యంగా చంద్రావతిగారి ఆశీర్వచనాలను అందుకోవాలని! అనౌన్స్‌మెంటు పూర్తయింది. వెన్నెల ఆలాపనతో పాటనందుకుంది. ఆ హాలంతా నిశ్శబ్దంతో నిండిపోయింది. ఆ గళంలోని మాధుర్యం ఆనంద బాష్పాలను కురిపిస్తూంటే ఆమె అవిటితనం గుండెని పిండేసినట్టనిపించింది. తరవాత కృష్ణశాస్త్రి గారి పాట.... అదీ చంద్రావతి ఏదో పిక్చర్‌కి పాడినది. ఇలా వరసగా నాలుగయిదు పాటలు పాడేసింది. 'చివరగా ఒక మాట. విజయనగరంలో పుట్టి సంగీత సాహిత్యానికి నిలయమైన ఆ వూళ్ళోని సంగీత కళాశాలలో సంగీతాన్ని అభ్యసించి, నా ప్రియతమ గాయనీమణి చంద్రావతిగారు పాడిన పాటల్ని ఆమె సమక్షంలో పాడాలన్న నా కోరిక ఈనాటికి తీరింది. ఏవైనా తప్పులుంటే మన్నించండి' అంటూ సవినయంగా సభకి నమస్కరించింది. ఆమె ఆత్మస్థయిర్యానికీ, సంస్కారానికి

ముగ్ధురాలినవుతూ అలాగే చూస్తూండిపోయాను, తెలియని తన్మయత్వంతో. ఇంమించు చంద్రావతీ అంతే!

అందరూ చంద్రావతి వంకే చూస్తున్నారు. ఆమె హుందాగా నడుచుకుంటూ స్టేజి మీదికి వెళుతూ ఉంటే! పైగా చంద్రావతి స్వభావం అందరికీ బాగా తెలుసు. నచ్చకపోతే నచ్చలేదని వాళ్ల మొహాన్నే చెప్పేస్తుంది. వెన్నెల గురించి ఆ అభిప్రాయమేమిటో? వందల కళ్లు అటే చూస్తున్నాయి. వెయ్యి నూట పదహార్ల బహుమతితో చంద్రావతి వెన్నెలను ఆశీర్వదించి అభినందించడం అందరికీ ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగించింది. ఆ తరువాత కార్యక్రమం మామూలే. చంద్రావతిగారిని గురించిన ప్రసంగాలూ, ప్రశంసలూ, తరువాత వాగ్దాటితో చంద్రావతిగారి ఉపన్యాసం. చివరగా ఒక చిన్న పాట చంద్రావతి పాడగా, కార్యక్రమం పూర్తయింది. స్వర్ణ కంకణ బహూకరణతో కార్యక్రమం ముగిసింది. జేజేనాదాల మధ్య, ఆటోగ్రాఫ్‌లూ, ఫొటోగ్రాఫుల నడుమ చంద్రావతీ నేను కారెక్కాం. కానీ, వెన్నెల మాత్రం నా మనసులో చెరగని ముద్ర వేసింది. రెండూ కాళ్లు లేని ఆ అమ్మాయి కళ్లల్లోని ఆత్మవిశ్వాసం, అరమరికలూ అర్థం లేని ఆర్భాటాలూ లేకుండా, చక్రాల బండిలో రావడం, వాళ్ల నాన్నగారలా ఆ బండిని తోసుకుంటూ, ఉయ్యాల్లోంచి పసిపాపను తెచ్చినట్టు తేవడం లాంటి దృశ్యాలన్నీ కళ్లల్లోంచి చెదరడంలేదు. కొన్ని రోజులు గడిచినా ఆ దృశ్యాలూ, ఆమె కంఠం నన్ను వీడటంలేదు. నాకు తెలియని ఒక అవ్యక్తమైన ప్రేమా, అభిమానం, గౌరవం, ఆ అమ్మాయిని తలుచుకున్న కొద్దీ కలిగాయి. అంత బాధలోనూ ఆ అమ్మాయి పెదవుల మీద చిరునవ్వు నాకు పదేపదే గుర్తుకొచ్చింది. అవన్నీ ఆ అమ్మాయికున్న ఆస్తి. అన్నీ ఉండీ ఏడ్చేవాళ్లనే తరచు మనం రోజూ చూస్తాం. కానీ, ఆ వెన్నెలలో న్యూనతాభావం మనకి ఏ కోశానా కనిపించదు. మైకు ముందుకొచ్చే ముందు వీల్‌ఛెయిర్‌లోనే తండ్రి సాయంతో టాయిలెట్ కెళ్లి దేక్కుంటూ, తిరిగొచ్చి 'నాన్నా నన్ను కూర్చోబెట్టు' అని పిలవగానే, అతను పాపాయిలా ఆమె నెత్తుకుని కూర్చోబెట్టడం, హ్యాండ్ బ్యాగ్‌లోంచి, చిన్న అద్దాన్ని పైకి తీసి, చెమట పట్టిన నుదుటిని జేబురుమాలుతో తుడుచుకుని జుట్టు, బొట్టు సరిచేసుకునొచ్చి, మైకు ముందు పాడటం, అంతా ఒక్కసారి కళ్ల ముందు కదలాడింది. అంతేకాదు... పాటకి ముందు ఆమె చెప్పిన నాలుగు మాటలూ, ఇప్పటికీ నా చెవిలో మారుమ్రోగుతున్నట్టే ఉంటుంది. 'నో...! నో! నాకు కావలసింది మీ జాలీ, సానుభూతీ కాదు. మీ ప్రోత్సాహం... అభిమానం' అన్న మాటలు. క్యాలెండరు మారింది. క్రమేణా వెన్నెల అడపాదడపా తప్ప, కొంచెం దూరమవుతూ వచ్చింది నా మనసులో. నా పనిలో నేను మునిగిపోయాను.

ఉదయం ఎనిమిదవుతోంది. టిఫిన్ తిని కాఫీ తాగుతూ పేపర్ చదువుతూన్నాను. ఫోను మోగింది.



**ఆ అమ్మాయికి ఏదైనా చెయ్యాలి. కనీసం 'వెన్నెల గానం' అని కార్యక్రమాన్ని పెట్టించి, పెద్ద ఎత్తున సత్కారం చేయించి, ధన రూపేణా సాయం చెయ్యాలి అనుకుంటూ రెండేళ్ళు గడిచినా అమలు చేయలేని, నా అవిటితనానికి సిగ్గేసింది. ఆ అమ్మాయికి కాళ్లే లేవు. కానీ నాకు మనసే లేదా? నా అనుభూతులు కేవలం తాత్కాలికమేనా?**

ఎడంచేత్తో రిసీవర్ తీసుకుని హలో అన్నాను.

"నేను మేడమ్... వెన్నెలని. గుర్తున్నానా? బాగున్నారా?" అంది.

"ఓ... వెన్నెలా... ఎలా ఉన్నావ్?" అడిగాను.

'ఫైన్ మేడమ్.. ఒక గుడ్‌న్యూస్. నాకు బాబు పుట్టాడు. బాగానే ఉన్నాడు. అన్నట్టు మీకు చెప్పలేదు కదూ. సారీ మేడమ్... గత సంవత్సరం నాకు పెళ్లైంది..."

"అంటే... మనం కలిసి..."

'రెండేళ్లయింది మేడమ్...! మా వారు ఇక్కడే జిల్లా పరిషత్ ఆఫీసులో టైపిస్టు. అతనూ పాడ్తారు. నా పాటంటే చెవి కోసుకుంటారు. మా పాటే మమ్మల్ని కలిపింది. పెళ్లికి పల్లవి అయింది. నన్ను పల్లకీలో కూర్చోబెట్టింది. ఇప్పుడు మా బాబు మా ప్రణయ చిహ్నం కాదు. పరిణయ చిహ్నం... ఎల్లుండి ఇరవై ఒకటో రోజు పేరు పెడతాం... మీరు రావాలి. అన్నట్టు చంద్రావతి మేడమ్ అంటే నాకిష్టం కదా... అందుకే బాబు పేరు ఆమె పేరు కలిసొచ్చేలా 'చంద్రముఖేష్' అని పెట్టాలనుకున్నాం. గలగలా నవ్వుతూ, మేడమ్! మొన్నటిదాకా మా మా వారు నన్ను పాపలా చూసుకున్నారు. ఇప్పుడాయనకి ఇద్దరు పిల్లలం. నేనూ, మా బాబూ, కిలకిలా నవ్వింది. ఆ నవ్వు కోయిల కూతలా ఉంది. గంధర్వ గానంలా ఉంది. కృష్ణుడి వేణువులా మనోహరంగా ఉంది....! ఆలోచనలతో తేలిపోతూన్న నేను ఎలాగో నోరు పెకిలించుకుని 'కంగ్రాజ్యులేషన్స్' అన్నాను.


"మేడమ్! మర్చిపోకండి. మీరు తప్పకుండా రావాలి" మరీ మరీ చెబుతూ ఫోను పెట్టేసింది. నా మనసు సిగ్గుతో కుంచించుకుపోయింది. ఆ అమ్మాయికి ఏదైనా చెయ్యాలి. కనీసం 'వెన్నెల గానం' అని కార్యక్రమాన్ని పెట్టించి, పెద్ద ఎత్తున సత్కారం చేయించి, ధన రూపేణా సాయం చెయ్యాలి అనుకుంటూ రెండేళ్ళు గడిచినా అమలు చేయలేని, నా అవిటితనానికి సిగ్గేసింది. ఆ అమ్మాయికి కాళ్లే లేవు. కానీ నాకు మనసే లేదా? నా అనుభూతులు కేవలం తాత్కాలికమేనా? ఛ... ఎంత తెలివితక్కువదాన్ని. వెన్నెలని చూసి 'అయ్యో' అనుకున్నాను. కానీ ఈ రోజు 'ఆహా...' అనేలా ఆమె నా కళ్లు తెరిపించింది. ఎల్లుండి వెళ్ళబోయే ఫంక్షన్‌కి ఇవాళే కవరులో అయిదు వేలు పెట్టి, 'చంద్రముఖేష్'కి రాసి పెట్టి అలమారలో ఉన్న ఒక కొత్త చీరా బ్లౌజు పీసూ తీసి, పసుపు కుంకుమల ప్యాకెట్లు పెట్టి, చక్కగా ప్యాక్ చేశాను. 'వెండి వెన్నెల కోయిలకి' ప్రేమతో 'నీకావ్య' అని రాసి!

★

# ఎగరలేని భారీ పక్షి

చిన్ని తల, భారీ శరీరం, బలమైన కాళ్లు గల ఈ పక్షికి అసలు ఎగరడమంటేనే తెలియదు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ ప్రాంతాలలోగల వర్షారణ్యాలలో నివసించే ఈ అతి పెద్ద పక్షి పేరు 'కాసోవారీ'. ఒకటిన్నర నుంచి ఇంచుమించు రెండు మీటర్ల ఎత్తుండే ఈ భారీ పక్షులలో మగవాటి కంటే ఆడ పక్షులు పెద్దవిగా ఉంటాయి. అంతేకాదు ఆకర్షణీయమైన ఈకలు కలిగి ఉంటాయి. ఆడ కాసోవారీల ప్రత్యేకత ఏమిటంటే గుడ్లు పెట్టడమే కానీ పొదగడం, పిల్లల పెంపకం గురించ అవి అసలు పట్టించుకోవు. ఆ రెండు బాధ్యతలను మగపక్షే చేస్తుంది. గ్రుడ్ల నుంచి బయటకు వచ్చిన చారల పిల్లల్ని తనే పెంచి పోషించడం వీటిలో మగపక్షుల ప్రత్యేకత చూశారుగా. పిల్లల్ని తండి పక్షి ఎలా తనతో తిప్పుతుందో?





-భూక్యా గోపీనాయక్